రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM
విలేఖరులు కావలెను
అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు,
నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు,
మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
అక్రిడిటేషన్ కార్డు ఇవ్వబడును
పూర్తి వివరములకు : 7396014218 / 6302990763 సంప్రదించగలరు
చల్లా శ్రీనివాసరావు చీఫ్-ఎడిటర్

RNI : APBIL/2023/86665
# రాయల్ జర్నలిజం
ద్వి భాషా దినపత్రిక
ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 60 శుక్రవారం 28 - 3 - 2025 చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 60 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 28 FRIDAY MARCH 2025 PAGES : 8 Rs :2-00

# మా ప్రభుత్వంలో మాయ మాటలు చెప్పేవాళ్లు లేరు

## పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు



పోలవరం: "పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను కోరుతున్నా. అందుకు అవసరమైన సిబ్బందిని ఇస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

**ఖర్చుచేసే ప్రతిపైసా నిర్వాసితులకే చెందాలి... :** 2014లో తాము అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వాసితుల గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదని విమర్శించారు. కనీసం వారి సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవన్నారు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోదీని ఒప్పించినట్లు తెలిపారు. వీలైనంత వరకు నిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లామన్నారు. రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని తెలి పారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని మండిపడ్డారు. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు.

**గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారు...:** తాను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశానని, 33 సార్లు ప్రాజెక్టును సందర్శించానని ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే నిర్వాసితులు ఈ పాటికే స్థిరపడేవారని తెలిపారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ. 2,500 కోట్ల ఆదాయం వచ్చేదన్నారు. దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగిపోయిందని తెలిపారు.

**మా ప్రభుత్వంలో మాయమాటలు చెప్పేవారు లేరు...** పునరావాసం కల్పించిన తర్వాత నిర్వాసితుల ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. నిర్వాసితులు




ధైర్యంగా ఉండాలని, ఇది మీ ప్రభుత్వం... మనందరి ప్రభుత్వమన్నారు. మంచిని మంచిగా చెబితే మరింత మంచి జరుగుతుందని తెలిపారు. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయ మాటలు చెప్పేవారు అస్సలు లేరని తెలిపారు. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారని, ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా తమ కూటమి ప్రభుత్వం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు.

# అలాంటి వారి పట్ల మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది: అమిత్ షా



దురాలోచనతో దేశంలోకి ప్రవేశించి, హాని కలిగించాలనుకునే వారి పట్ల నరేంద్ర మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి వారిని అడుగు పెట్టనివ్వబోమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అందరికీ ఆహ్వానం పలకడానికి భారతదేశం ధర్మశాల కాదని వ్యాఖ్యానించారు. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు-2025'కి లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, విద్యా, వైద్యం, పర్యాటకం, వ్యాపార పరంగా మన దేశంలోకి విదేశీయులను ఆహ్వానిస్తామని, కానీ దురుద్దేశంతో ప్రవేశించే వారి పట్ల కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి సహకరించే వారికి తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని ఆయన అన్నారు.ఈ బిల్లు భారత్ సందర్శించే ప్రతి విదేశీయుడి గురించిన మొత్తం సమాచారాన్ని స్వీకరిస్తుందని ఆయన వెల్లడించారు. మయన్మార్ నుంచి అక్రమంగా వచ్చే రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల సంఖ్య పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాలతో అలాంటి వారిని దేశంలోకి రానిస్తే అది ఎంతమాత్రమూ సురక్షితం కాదని అన్నారు.బెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారులకు సహకరిస్తోందని ఆరోపించారు. వారికి ఆధార్ కార్డులు ఇచ్చి సౌకర్యాలు కల్పిస్తోందని మండిపడ్డారు. చొరబాట్ల నివారణకు కంచె ఏర్పాటు చేయడానికి బెంగాల్ ప్రభుత్వం కనీసం భూమిని కేటాయించలేకపోయిందని విమర్శించారు. అందుకే 450 కిలోమీటర్ల మేర కంచె పూర్తి కాలేదని అన్నారు.ఈ ఇమ్మిగ్రేషన్ బిల్లు దేశ భద్రతకు, అలాగే 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకున్న వైసీపీ



అమరావతి: కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవిని వైసీపీ కైవసం చేసుకుంది. జిల్లాపరిషత్ ఛైర్మన్ గా వైసీపీ జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో పోటీకి టీడీపీ దూరంగా ఉంది. ఛైర్మన్ పదవికి కేవలం వైసీపీ నుంచి మాత్రమే నామినేషన్ రావడంతో రామగోవిందరెడ్డి గెలుపొందినట్టు ఎన్నికల అధికారి ప్రకటిం చారు. జడ్పీ ఛైర్మన్ గా ఎన్నికైన రామగోవిందరెడ్డి బ్రహ్మంగారిమఠం మండలం జడ్పీటీసీగా రెండు పర్యాయాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమైన వైసీపీ అధినేత జగన్... రామగోవిందరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.

# కొడాలి నానిని ఫోన్ లో పరామర్శించిన జగన్



అమరావతి: వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లో ఉంటున్న నానికి నిన్న ఛాతిలో నొప్పి రావడంతో గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. కొడాలి నానికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. మూడు వాల్వ్ బ్లాక్ అయినట్టు గుర్తించారు. నానికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు, కొడాలి నానిని వైసీపీ అధినేత జగన్ ఫోన్ లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని నానికి చెప్పారు. నాని ఆరోగ్యంపై ఏఐజీ ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు.

# బీసీ హాస్టల్ విద్యార్థి దుర్మరణం బాధాకరం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి : గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై విచారకరమని ఆవేదన వ్యక్తంచేస్తూ, విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా వెందుర్తి మండలం గంగలకుంట గ్రామానికి చెందిన బి.కిశోర్ గుంటూరుకు చెందిన వట్టి చెరుకూరు బీసీ హాస్టల్ లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడన్నారు. ప్రమాదవశాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారమంది ంచామన్నారు. హాస్టల్ విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్ శారదా రాణిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

**విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి...**

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్లలను హాస్టళ్లలో చేర్చుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు చోటుచేసుకోడం క్షమించరాని నేరమన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దని స్పష్టంచేశారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరి ంచేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో మంత్రి సవిత స్పష్టంచేశారు.

# భారీ విరాళాలు అందుకున్న టీటీడీ



అమరావతి: ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల నుంచి భారీ విరాళాలు అందుకుంటోంది. ఇవాళ ఏకంగా రూ.2.45 కోట్లు విరాళాల రూపంలో అందాయి. దీనికి సంబంధించిన వివరాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. టీటీడీ చేపడుతున్న వివిధ పథకాలకు భక్తులు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చారని తెలిపారు. చెన్నైకి చెందిన జినేశ్వర్ ఇన్ ఫ్రా వెంచర్స్ సంస్థ టీటీడీ ఎస్వీ అన్నదాన ట్రస్టుకు రూ.1 కోటి విరాళం అందించగా, శ్రీలంకకు చెందిన మరో భక్తుడు అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1 కోటి విరాళం ఇచ్చాడని బీఆర్ నాయుడు వివరించారు. నోయిడాకు చెందిన పసిఫిక్ బీపీవో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవెంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించినట్టు తెలిపారు.

# వల్లభనేని వంశీకి షాక్- దక్కని ఊరట



అమరావతి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మాజీ శాసన సభ్యుడు వల్లభనేని వంశీకి ఊరట దక్కలేదు. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఫలితంగా ఇంకా కొన్ని రోజులపాటు పోలీసుల కస్టడీలోనే కొనసాగనున్నారు.గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కేసులో వల్లభనేని వంశీ నిందితుడు. ఈ ఘటనలో ఆయనను ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. హైదరాబాద్ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆయనను విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచి గన్నవరానికి తరలించారు.తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్ వంటి కేసులు వల్లభనేని వంశీపై ఉన్నాయి. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయన పేరును పోలీసులు ఏ71గా చేర్చారు. పోలీసుల కస్టడీలో ఉంటోన్నారు. అదే సమయంలో సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులోనూ వంశీ విచారణను ఎదుర్కొంటోన్నారు.బెయిల్ కోరుతూ ఇదివరకే విజయవాడ 12 అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో వంశీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. నేడు వాదోపవాదాలను ఆలకించింది. ఇరుపక్షాల వాదనలను ఆలకించిన అనంతరం పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అరెస్ట్ అవుతాననే ఉద్దేశంతో ముందస్తు బెయిల్ కోసం కూడా వల్లభనేని వంశీ ప్రయత్నాలు సాగించారు గానీ అది సాధ్యపడలేదు. అక్రమంగా ఇసుక తవ్వకాల కేసులు కూడా ఆయనపై ఉన్నాయి.

# ఏప్రిల్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై జిల్లా అధికారులు కసరత్తు...



రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: ఏప్రిల్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడానికి అవసరమైన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.మురళి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా ఎస్.పి తుషార్ డూడి సందర్శించారు. కొత్త గొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి దిగటానికి అనుకూలం హెలిప్యాడ్ ఏర్పాటు చేయవలసిందిగా ఆర్ %డ% బి అధికారులను ఆదేశించారు.2వేల మంది ప్రజలు హాజరయ్యే విధంగా కూర్చోవడానికి అనుకూలంగా సభా ప్రాంగణ ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచించారు. ప్రజా వేదిక వద్ద జీరో పావర్టీ గురించి రెండు స్టాల్స్ ని ఏర్పాటు చేయవల సిందిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సుమారుగా 4 గంటల పాటు కొత్త గొల్లపాలెం గ్రామంలో జరుగు తుందని ఆయన చెప్పారు. ముఖ్య మంత్రి హెలిప్యాడ్ దిగిన అనంతరం ప్రజా ప్రతినిధులను కలుసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం పెన్షన్లు పంపిణీ చేయడానికి లబ్ధిదారుల గృహాలకు ముఖ్యమంత్రి వెళతారని ఆయన చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న రామాలయం దేవాలయానికి వెళతారని ఆయన చెప్పారు. అనంతరం ప్రజా వేదికకు వెళతా రని ముఖ్య మంత్రితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారని ఆయన అన్నారు. ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్న తర్వాత తిరిగి హెలిప్యాడ్ కు వెళతారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులకు కేటాయించి విధులను నిర్వహించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి తుషార్ డూడి,



జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి , డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు "ఫ్రెండ్స్ ఆదర్శయూత్ ఆర్గనైజేషన్" ఆర్థిక సహాయం



రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి కట్టు బట్టలతో రోడ్డుపై నిలిచిన బాధిత కుటుంబానికి తమ వంతు అండగా నిలుస్తామని "ఫ్రెండ్స్ ఆదర్శయూత్ ఆర్గనైజేషన్" కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ అన్నారు. కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన నలమోలు అర్జునరావు ఇల్లు మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోవడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ సభ్యులు గురువారం ఐదువేల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ అగ్ని ప్రమాదంలో బాధితులకు సుమారు పది లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినదని వాపోతున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో రోడ్డు మీద ఉన్న బాధితులకు ఆర్థిక సహాయం అందజేయటం జరిగినది అన్నారు. రాత్రి సమయంలో ప్రమాదం సంభవించడం వలన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై నిలుచున్నామని, ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం, 10 సవర్ల బంగారం అగ్నికి ఆహుతి అయినాయని అన్నారు. బాధితులకు మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మద్దిబోయిన గోపి, ట్రెజరర్ జోగి సువర్ణ రాజు, సభ్యులు నందిపాటి శ్రీరాం సునీల్, మాడసాని బాలాజీ, విన్నకోట శ్రీనివాసరావు, యాసం రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వేగేశన తొలి ప్రయత్నం ఫలించింది...

## సూర్యలంక అభివృద్ధికి 97 కోట్లు మంజూరు చేసింది

రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: బాపట్ల సూర్యలంక సముద్ర తీర అభివృద్ధికి శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు చేసిన కృషి ఫలించింది. శాసనసభ్యుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి అసెంబ్లీలో 9 నిమిషాలు మాట్లాడి సూర్యలంక పై సానుకూల స్పందన వచ్చే విధంగా ప్రభుత్వాన్ని మెప్పించి, ఒప్పించి సఫలీకృతులయ్యారు. తొలి సమావేశం లోనే సూర్యలంక సముద్ర తీరాని కి 97 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యేలా చేసిన తొలి ప్రయత్నం లోనే తన సంకల్పాన్ని సాధించుకోగలిగారు. సూర్యలంకకు నిధులు మంజూరు చేయటం తనకెంతో సంతోషం కలిగించిందని నరేంద్రవర్మ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బాపట్ల నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులను పలకరిస్తూ అద్భుత సుందర మణిహారంగా విరజిల్లుతున్న సూర్యలంక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనటానికి ఇదొక్కటే బలమైన ఉదాహరణ అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. చీరాల ఓడరేవు నుండి బాపట్ల సూర్యలంక తీరాన్ని కలుపుతూ రహదారి ఆవశ్యకతను తెలియజేస్తూ తాను చేసిన




ప్రతిపాదనకు ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. 97 కోట్ల రూపాయల నిధుల మంజూరు తో బాపట్ల సూర్యలంక అభివృద్ధికి తొలి అడుగు పడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక పర్యాటక ప్రదేశాలకు మించి బాపట్ల సూర్యలంక సముద్ర తీరంలో పుష్కలమైన వనరులు ఉన్నాయని తెలిపారు. పర్యాటకులకు అందమైన అనుభూతిని కలిగించే ఒక రమణీయ పర్యాటక కేంద్రంగా సూర్య లంకకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం తాను చేసిన ప్రతిపాదనపై వెంటనే స్పందించి నిధులు మంజూరు చేస్తూ ప్రకటన చేయటం తన తొలి సంకల్పానికి లభించిన ఒక గొప్ప సంకేతంగా భావిస్తున్నానని నరేంద్రవర్మ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి షెకావత్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.



# బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కె.అవినాష్ ఏకగ్రీవ ఎంపిక



రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: బాపట్ల జిల్లా కోర్ట్ కు సంబంధించి 2025-26 సంవత్సరమునకు బార్ అసోసియేషన్ కార్యవర్గ0 ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది యలవల నరేష్, సహాయక ఎన్నికల అధికారిగా ఐ. రామాంజనేయులు వ్యవహరించారు. ఎన్నికలను ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్య ప్రసాద్ పర్యవేక్షించారు. ఐతే ఈ ఇన్నికలలో ఎటువంటి పోటీ లేకుండా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా కె.అవినాష్, ఉపాధ్యక్షులు కె.రవి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ రామాంజనేయులు, జాయింట్ సెక్రెటరీ ఎమ్. శ్యామలా దేవి, కోశాధికారి బి. చిరంజీవి మార్కండేయులు, మహిళా న్యాయవాది ప్రతినిధి జి. సువర్ణ నాగమొహిని ఎన్నికయ్యారు. ఎన్నికైన అభ్యర్థులను బార్ అసోసియేషన్ సభ్యులు పుష్ప గుచ్ఛాలతో అభినందించారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన పై పటిష్టమైన భద్రతా చర్యలు...



రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఏప్రిల్ ఒకటవ తేదీ పర్చూరు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి , ఎస్పీ తుషార్ డూడి లు చినగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెం గ్రామంలో జిల్లా అధికారులతో కలిసి పర్యటించారు. హెలిప్యాడ్ స్థలాన్ని, సభా ప్రాంగణాన్ని, పెన్షన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను, కార్యకర్తలతో సమావేశం నిర్వహించు ప్రదేశాన్ని, వివిపి వాహనాల పార్కింగ్ స్థలాన్ని, కాన్వాయ్ వెళ్ళు మార్గాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పర్యటనలో భాగంగా వివిధ శాఖ అధికారులు నిర్వహించవలసిన విధులు గురించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులకు కేటాయించి విధులను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్తగొల్లపాలెం గ్రామంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూట్ బందోబస్తు విధులు కీలకమన్నారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ నిబద్దతో విధులు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద, సభ ప్రాంగణంలో పటిష్ట బారికెట్స్ ఏర్పాటు చెయ్యాలలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, చీరాల డిఎస్పీ మోయిన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ ,డ్వామా ప్రాజెక్ట్



డైరెక్టర్ విజయలక్ష్మి , డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివా సరావు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఇంకొల్లు సిఐ రమణయ్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టెడ్డిబేర్ వేషంలో ప్రాంక్స్ చేస్తున్న యువకునికి పోలీసులు కౌన్సిలింగ్




రాయల్ జర్నలిజం(బాపట్ల) మార్చి 27: ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే సహించేది లేదని పట్టణ సి.ఐ రాంబాబు అన్నారు. గురువారం స్తానిక పట్టణ పోలిస్ స్టేషన్ లో జరిగిన వేలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా పట్టణ సి.ఐ రాంబాబు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో టెడ్డీబేర్ వేషం వేసుకొని కొందరు సూర్యలంక బీచ్ రోడ్ మరియు బాపట్లలోని ప్రధాన రహదారు లలో తిరుగుతూ పబ్లిక్ ని, స్టూడెంట్స్ ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పిర్యాదులు రావడంతో అందులో భాగంగా నేడు కూడా టెడ్డీబేర్ వేషంతో బీచ్ రోడ్ లో ప్రజలకు అసౌకర్య0 కల్పిస్తున్నారని మా దృష్టికి రావడంతో టెడ్డీబేర్ వేసే వ్యక్తిని మరియు ఆ వ్యక్తిని వీడియో తీసే వ్యక్తిని ఇద్దరిని పట్టుకుని స్టేషన్ తీసుకొని రావటం జరిగిందని, వారిని విచారించగా వారికి యూట్యూబ్ ఛానల్ ఉన్నదని, అవేర్నెస్ కోసం వీడియోస్ తీసి అప్లోడ్ చేస్తామని మాకు తెలపడం జరిగిందని అన్నారు. ఆ యువకులకు సంబంధించిన కుతుమ్భాస భ్యులను పిలిపించి వారి సమక్షంలో ఈ విధంగా చేయటం తప్పని, ఏదైనా ప్రైవేట్ ఫంక్షన్ లో ఇటువంటి కార్యక్రమాలు చేసుకోమని వారికి కౌన్సిలింగ్ చేసి పంపడం జరిగిందని తెలిపారు.

# స్థానిక సమస్యలపై ధర్నా మరియు వినతి పత్రం



తాళ్లరేవుమార్చి , 27 : తాళ్లరేవు మండల సిపిఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ఎంపీడీవో ఆఫీసు వద్ద మరియు మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మండల స్థాయి అధికారులకు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ నాయకులు ఎం రాజశేఖర్ టి ఈశ్వరరావు సిహెచ్ రమణి తదితరులు మాట్లాడుతూ తాళ్లరేవు మండలంలో మార్చి 7, 8 తారీకులలో రెండు రోజులు పాటు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తదితర నాయకులు అందరూ చొల్లంగి నుండి నీలపల్లి వరకు రెండు రోజులు పాటు సైకిల్ యాత్ర చేసి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని ఆ సమస్యలను పరిష్కరించాలని ఈరోజు మండల ఆఫీసులు వద్ద ధర్నా చేసి వినతి పత్రాలు సమర్పించామని ముఖ్యముగా యాత్రలో ప్రజలు చెప్పిన అంశాలు గ్రామాలలో నిర్మించిన డ్రైన్స్ కు అవుట్ లెట్ లేకపోవడం కొన్ని గ్రామాలలో సిసి రోడ్లు డ్రైన్లు వేయకపోవడం ప్రధానమంత్రి జల జీవన్ మిషన్ నిధులు లేక కొత్తగా వేసిన కుళాయిలు రాకపోవడం మరియు పారిశుధ్యం పనులు సక్రమంగా లేకపోవడం మరియు మండలంలోని ఎస్సీలకు కమ్యూనిటీ స్థలం లేకపోవడం అసైన్డ్ భూములు ఉన్న ప్రజలకు పట్టాలు కానీ పాసుబుక్కులు కానీ లేకపోవడం జార్జి పేట గ్రామంలో జిల్లా పరిషత్ భూములు అన్యాక్రాంతం అవడం ఉపాధి హామీ సమస్యలు తదితర అనేక సమస్యలు పై వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది అని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు

# ప్రకృతి వ్యవసాయం యాక్షన్ ప్లాన్ 2025 అవగాహన సదస్సు



తాళ్లరేవు మార్చి , 27 : తాళ్లరేవు మండలం పరిధిలోని వ్యవసాయ, రెవెన్యూ, యన్ఆర్జియస్, హార్టికల్చర్, సెర్ప్, మరియు జెడ్ బి యన్ ఎప్ సభ్యులు కి అవగాహన సదస్సు మండల పరిషత్ సమావేశ హల్ లో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది, ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి కే.బాబూరావు, రెవిన్యూ, సెర్ఫ్, హర్టీకల్చర్, ఎడి కే.బాబూరావు, ఎఒ యన్.ప్రశాంతి, స్టేట్ యన్ ఎఫ్ ఎ మహేష్, జిల్లా కో ఆర్డినేటర్ గణేష్, యంటి ధనలక్ష్మి, మరియు పి.మల్లవరం యూనిట్ స్టాఫ్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ప్రోత్సాహిస్తున్న రైతులు ధుళిపూడి వెంకటరమణ (బాబి), పంపన రామకృష్ణ లను సన్మానించారు, వ్యవసాయ శాఖ ఏడి బాబూరావు మాట్లాడుతూ సిబ్బంది అందరూ అవగాహన తో పనిచేసిన రోజు నే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది అని తెలిపారు, ఎఓ ప్రశాంతి మాట్లాడుతూ దాళ్వా పంట అనంతరం ప్రతీ రైతూ తమ పంట చేలలో పియండియస్ విత్తనాలు గాని, అపరాలు వేసేలా రైతు భరోసా కేంద్ర సిబ్బంది రైతులు కి అవగాహన కల్పించాలన్నారు, రైతులు పంపన రామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు, ధుళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సారధ్యంలో ప్రకృతి వ్యవసాయానికి బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించారని, కావునా ఈ సమావేశంలో పాల్గొన్న అన్ని శాఖల సిబ్బంది సమన్వయం తో పనిచసి రైతులు కి అవగాహన కల్పించాలన్నారు, అదేవిధంగా తొందర్లోనే యన్ఆర్జియస్ నిధులు కూడా ప్రకృతి వ్యవసాయం కు అనుసంధానం చేసే విధంగా ఆలోచన చేయడం శుభసూచకం అన్నారు.

# తెలుగుదేశం హర్షధ్వానాలతో మారుమోగిన పి వేమవరం గ్రామం

పెద్దాపురంమార్చి , 27పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం పీ.వేమవరం గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ గా 7వార్డు మెంబర్ మేడిది వీరఘవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు11 మంది గ్రామవార్డు సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించూసుకున్నారు.ఈమేరకు ఎన్నికల ప్రీసైడింగ్ అధికారి మేడపాటి సత్యనారాయణ రెడ్డి ఎన్నిక ధృవ పత్రాన్ని అందజేశారు.నూతనంగా ఉప సర్పంచ్ గా ఎన్నికైన వీర రాఘవమ్మను, తదితర వార్డు మెంబర్లను పి వేమవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు..ఈ సందర్భంగా ముసిరెడ్డి శ్రీరాములు,రాంబాబు మాట్లాడుతూ మేడిది వీరరఘవమ్మ ప్రభాకర్ పార్టీలో చేరినప్పటి నుండి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప గెలుపుకోసం తన వంతు కృషి చేసి తన ఔన్నత్యాన్ని చాటుకున్నా%తీబ% అని కొనియాడారు .ఉపసర్పంచ్ గెలుపునకు వార్డు మెంబర్లు అయిన మాగాపు కామేశ్వరరావు, మేడిదికాంతం, ముసిరెడ్డి రాంబాబు, శ్రీపతి కాశీ విశ్వనాథం, మేడది వీర రాఘవమ్మ,అత్తిలి బాల సూర్యనారాయణ , మిగిలిన వార్డ్ మెంబర్లు కూడా తమ మద్దతు తెలిపారు , అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. బిజెపి నాయకులు శ్రీపతి సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై ఈరోజు ఉపసర్పంచ్ గా మేడిది వీరరఘవమ్మ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు.కూటమి నాయకులంతా కలిసి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిచేందుకు కృషి చేస్తామన్నారు.ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పెద్దాపుర డి.ఎస్.పి శ్రీహరి రాజు పర్యవేక్షణలోసామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ ఎస్ఐ మూర్తి మరియు, సిబ్బందితో భద్రత ఏర్పాట్లు పట్టిష్టంగా చేశారు...ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేడిది గణేష్,కొండపల్లి రాంబాబు, మేడిది నాగ బాబు, బీజేపీ నాయకులు శ్రీపతి సుబ్బారావు , తెలుగుదేశం పార్టీ శ్రీపతి గోవిందు , శ్రీపతి అప్పారావు , మేడిది తమ్మి రాజు, బుజ్జి , దొర, రాజు తదితర తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు

# డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధర్నా



కాకినాడమార్చి , 27 : రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని లేని పక్షంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కాకినాడలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ముందుగా కాకినాడ నగరంలో బాలాజీ చెరువు సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. ఇందులో 92 వేల మంది అర్హత సాధించారని, రెండేళ్లు సుదీర్ఘ పోరాటం తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారన్నారు. ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని రామన్న డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీస్ శాఖలో 20వేలు దాక పోస్టులు ఖాళీగా ఉన్నాయని మరి వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూం అద్దెలు కట్టలేక, పుస్తకాలు కొనలేక, భార్యను, కుటుంబాన్ని వదిలేసి చదువుకుంటుటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటున్నారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తా_నన్న పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాగానే గొంతు మూగబోయిందిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పిడి ప్రసాద్, జిల్లా నాయకులు టి రాజాలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతతో ఆటలు ఆడుతోందన్నారు. పది నెలలో ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పట్ల ఇలాగే వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పవన్, నాయుడు, వేణుగోపాల్, ప్రవీణ్, వినీత్, సురేష్, హరీష్ కుమార్, జగన్, రామారావు, కృష్ణ, జగన్నాథరావు, పూర్ణ, శ్యాంబాబు వందలాదిమంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా సారథ్యంలో నియోజకవర్గ రోడ్లకు మహర్దశ...



ప్రత్తిపాడుమార్చి , 27 :గురువారం ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకటరావు, కార్యదర్శి జంకల పకీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో చాలా రోడ్లు గత కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా గారి చొరవతో రోడ్లకు మహర్దశ కలిగిందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీటీ రోడ్లు, సీసీ రోడ్లకు 15.83 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో 1.33 కోట్లు ప్రత్తిపాడు మండలానికి మంజూరు చేయించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా కి, ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి ప్రత్తిపాడు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు , క్లస్టర్ ఇన్చార్జి పల్లా గోపి , మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు , దాకారపు కృష్ణ , సర్పంచ్ మంతెన శ్రీను గారు, సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు , లొండ లోవరాజు , రామిసెట్టి మునసబు , సుంకర సోమరాజు , మదినే దొరబాబు , లీసు సత్తిబాబు , రావూరి తాతాజీ , ముత్యాల రాంబాబు , కుండల అప్పారావు పాల్గొన్నారు.

# నాటక రంగాన్ని ప్రోత్సహించాలి



కాకినాడ)మార్చి , 27 : ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగాన్ని ప్రజలు ఆదరించడంతోపాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలని నాటక కళాకారుడు ఏ. దక్షిణామూర్తి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారు. కళాకారుడు జీవీకే మోహన్ రావు మాట్లాడు తూ నేడు నాటక రంగం ఆధునికతను సంతరించుకుంటూ సామాజిక, రాజకీయ సమస్యల ను సార్వజనీనకంగా రచిస్తూ సమగ్రంగా చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అనం తరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో నాటక రంగ కళాకారులు ఏ. దక్షిణామూర్తి, జీవీకే మోహన్ రావు, జీ సత్యానందం ,బర్రె సత్యనారాయణ తదితరులను ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు ,రాజా, ప్రసాద్ నాయుడు, వై. కృష్ణ, మల్లీశ్వరి, మాధవి పాల్గొన్నారు.

# సమాజాన్ని ప్రభావితం చేసేది నాటకరంగం: డా అడ్డాల



కాకినాడమార్చి , 27 : స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరంలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ రంగస్థల దినోత్సవం సంధర్భంగా ప్రముఖ రంగస్థల కళాకారుడు బొట్టా అనిల్ ని ఘనంగా సన్మానించారు.ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ"ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 27న జరుపుకుంటారు, ఈ రోజు నాటక కళను, దాని అభ్యాసకులను మరియు సాంస్కృతిక మరియు మానవ వ్యక్తీకరణలో దాని పాత్రను గౌరవించడానికి అంకితం చేయబడింది అని అన్నారు.సామాజిక సమస్యలను పరిష్కరించడానికి, మానవ హక్కులను ప్రోత్సహించడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా సమాజాలను ప్రభావితం చేసే సంబంధిత అంశాలతో నిమగ్నమవ్వడానికి రంగస్థలం యొక్క శక్తి గురించి అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఒక వేదికగా పనిచేస్తుందని అన్నారు .బొట్టా అనిల్ మాట్లాడుతూ" నాటక రంగం సాంస్కృతిక మరియు భాషాపరమైన అడ్డంకులను అధిగమించే ప్రపంచ భాష అని ప్రపంచ నాటక దినోత్సవం నాటక రంగం వివిధ సంస్కృతుల మధ్య అవగాహనను సృష్టించగలదనే ఆలోచనను ప్రోత్సహిస్తుందని, చివరికి ఇది గొప్ప సానుభూతి మరియు ఐక్యతకు దారితీస్తుందని అన్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNLISAM

# వైఎస్ జగన్ సరికొత్త స్ట్రాటజీ.. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి కీలక పదవి



అమరావతి : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలో కీలక నియామకాలు చేపట్టారు. ఈ క్రమంలో బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి కీలక బాధ్యతల్ని అప్పగించారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా శెట్టిపల్లి రఘురామిరెడ్డి, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా రెడ్డి శాంతి, తానేటి వనిత, కైలే అనిల్, వై.విశ్వేశ్వరరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడిగా కాకుమాను రాజశేఖర్, నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘోరంగా ఓడిపోయింది.. ఆ పార్టీ కేవలం 11 స్థానాలకు పరిమితమైంది. ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్‌సీపీని వరుసగా నేతలు వీడుతున్నారు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీలో నంబర్ 2గా ఉన్న విజయసాయిరెడ్డి ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేశారు.. పార్టీలో మొదటి నుంచి ఉన్నవారు కూడా బయటకు వచ్చారు. ఈ పరిణామాలతో వైఎస్ జగన్ పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టారు.. వరుసగా కొత్త కమిటీలను నియమిస్తున్నారు. పార్టీ అనుబంధ విభాగాలతో పాటుగా జిల్లాలకు కొత్త అధ్యక్షులు, నియోజకవర్గాలకు కొత్త ఇంఛార్జ్‌లను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా పార్టీకి సంబంధించి కీలక నియమాకాలు జరిగాయి.వైఎస్సార్‌సీపీ నూతన క్రమశిక్షణ కమిటీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, సభ్యులుగా రెడ్డిశాంతి, కైలే అనిల్‌కుమార్, వై.విశ్వేశ్వరరెడ్డి, తానేటి వనితను నియమించినట్లు తెలిపారు. అంతేకాదు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యనిర్వహక అధ్యక్షుడిగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి.. ప్రకాశం జిల్లాకు చెందిన కాకుమాను రాజశేఖర్ పార్టీ వైఎష్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడిగా, ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్తగా ఆలూరు సాంబశివారెడ్డి నియమితులయ్యారని ప్రకటించాంరు. పార్టీ పదవుల భర్తీలో భాగంగా పలు నియామకాలను అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

# ఆ గుడిలోకి అకస్మాత్తుగా వచ్చిన ఆవు.. భక్తులు ఆశ్చర్య పోయేలా ఏంచేసిందంటే..



అమరావతి : గుడికి వెళ్తే దేవుడిని దర్శించుకునే ముందు.. ఆలయం చుట్టూ భక్తిశ్రద్దలతో ప్రదక్షిణలు చేస్తాం. ఇది సర్వసాధారణంగా పాటించే నియమం. అయితే గత కొంత కాలంగా ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న జంతువులు, పక్షులకు సంబంధించిన వార్తలు వింటూనే ఉన్నాం. వీడియోలు చూస్తూనే ఉన్నాం.. అంతేకాదు ఒకొక్కసారి వానరం, పాము, ఎలుగుబంటి వి గర్భ గుడిలో దైవం దగ్గర పూజలు చేస్తున్నట్లు కూడా కొన్ని రకాల వీడియోలు నెట్టింట్లో ప్రత్యక్షం అవుతాయి. వీటిని చూసిన భక్తులు ఆశ్చర్యానికి లోనై ఇదంతా భగవంతుని మహత్యంగా చెప్పుకుంటున్నారు. తాజాగా ఓ జంతువు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసింది. ఈ ఘటన ఎక్కడ జరిగింది.. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన జంతువు ఏమిటి అని వివరాలు ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందాం.ఏలూరు జిల్లా నిడమర్రు మండల కేంద్రమైన నిడమర్రులో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఆలయానికి ప్రతిరోజు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు సమర్పిస్తారు. అయితే ఈనెల 24వ తేదీ సోమవారం తెల్లవారుజామున ఆలయానికి ఒక ఆవు వచ్చింది. ఆవు ఆలయం ముందు నుంచి నడుస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం మొదలుపెట్టింది. అలా కాసేపు ప్రదక్షిణలు చేసిన తరువాత ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వచ్చి నిలబడింది. ద్వారం వద్ద నుండి స్వామి వారి మూలవిరాట్ను ఈ తీక్షణంగా చూస్తూ స్వామివారిని దర్శించుకుంది.అలా కాసేపు స్వామివారిని దర్శించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి అనంతరం స్వామివారిని దర్శించిన ఆ గోమాతను చూసిన భక్తులు, స్థానికులు ముందుగా ఆశ్చర్యానికి లోనయ్యారు.. ఆ తర్వాత ఇదంతా భగవంతుని మహిమ గా చెప్పుకుంటూ ఆలయానికి వెళ్లి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం ఏలూరు జిల్లాలో వైరల్ గా మారింది.

# యేళ్లుగా నానుతున్న కానిస్టేబుల్ పోస్టులకు ఎట్టకేలకు మోక్షం.. త్వరలోనే ధ్రువపత్రాల పరిశీలన




హైదరాబాద్ : యేళ్లకేళ్లుగా నానుతున్న 2018 బ్యాచ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ అభ్యర్థులకు త్వరలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభంకానుందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వెల్లడించారు. ఆయన ఈ మేరకు వెల్లడించారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్, ప్రజావాణి ఇన్‌ఛార్జి డాజి చిన్నారెడ్డి మీడియాకు తెలిపారు. మార్చి 25న ప్రజా భవన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఆయన్ను కలిసి నియామక ప్రక్రియపై వివరాలు కోరారగా.. స్పందించిన చిన్నారెడ్డి పోలీస్ రిక్రూట్‌మెంట్ ఛైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు చెప్పడంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

**విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదు: సీఎం రేవంత్**

తెలంగాణలో ప్రతిస్థాయిలో విద్యా రంగం రోజురోజుకూ క్షీణిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగిందని.. ఈ సర్వే ప్రకారం 75 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదని సీఎం రేవంత్ అన్నారు. ఈ సర్వేలో తెలంగాణ చివరి నుంచి ఐదో స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానంలో రాష్ట్రం 36వ స్థానంలో ఉందని, ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు కూడా చదవలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆధికారులను ఆదేశించారు.

**విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు కమిటీ.. మంత్రి దామోదర్ రాజనర్సింహ**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు త్వరలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అసెంబ్లీలో తెలిపారు. ఈ మేరకు విద్యకు సంబంధించి పద్దులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. 2014లో 28,405 పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. ఆ సంఖ్య నేడు 19 లక్షలకు తగ్గిపోయిందని, గురుకులాల్లో 1.75 లక్షల విద్యార్థులు ఉండగా నాలుగు లక్షలకు పెరిగారని తెలిపారు. 1913 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉండగా.. 73 పాఠశాలలను తిరిగి తెరుచుకున్నట్లు వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మధ్యాహ్న భోజన ఛార్జీలు, ఏకరూప దుస్తుల కుట్టు ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు.

# వెండి నగలకు బంగారం ఇవ్వమన్న ఇద్దరు మహిళలు.. డౌట్ వచ్చి.. ఆరా తీయగా



అమరావతి : నకిలీ వెండితో బంగారాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు మహిళలను రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు ద్వారకా పోలీసులు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన ఇద్దరు మహిళలు బుధవారం ద్వారకానాగర్‌లోని ఓ జువెలరీ షాప్‌నకు వచ్చారు. తమ దగ్గర మూడు కిలోల వెండి ఉందని.. దానికి బదులుగా బంగారాన్ని కొనుగోలు చేస్తామన్నారు.అయితే ఆ మహిళల కదలికలపై అనుమానమొచ్చి.. దుకాణం సిబ్బంది ఆ ఇద్దరు ఇచ్చిన వస్తువులను చెక్ చేయగా.. అది నకిలీ వెండిగా తేలింది. వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు జ్యువెలరీ షాప్ సిబ్బంది. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఆ ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. వారి వద్ద ఉన్న మూడు కిలోల నకిలీ వెండిని సీజ్ చేశారు. అలాగే 2023లోనే ఇదే తరహా ఘటన ఒకటి జరిగిందని పోలీసుల విచారణలో తేలింది.ఇదే షాప్‌లో గతంలోనూ ఇలాగే ఏడు గ్రాముల బంగారాన్ని అపహరించినట్టు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆ కేసులో నిందితులు.. ఇప్పుడు పట్టుబడిన మహిళలు ఒకరేనని నిర్ధారించారు. వీరంతా ఒక ముఠాగా బీహార్ నుంచి విశాఖపట్నం వచ్చినట్టుగా గుర్తించి.. ఆ ఇద్దరు మహిళలతో పాటు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# పైకేమో అందాల భామ.. చేసే పనులేమో అయ్యబాబోయ్ అనేలా.. అసలు కథ తెలిస్తే మైండ్ బ్లాంకే..



హైదరాబాద్ : ఒడిశాకు చెందిన గంజాయి గ్యాంగ్ లేడీ డాన్ సంగీతాసాహూ అలియాస్ గీతాసాహూ ఎట్టకేలకు హైదరాబాద్ పోలీసులకు అడ్డంగా బుక్కయింది. ఒడిశా కుర్థా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీతా సాహూ.. గత నాలుగేళ్లుగా హోల్‌సేల్ గంజాయి వ్యాపారం చేస్తోంది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండడంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని వారికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తెలంగాణలో ఐదు కేసుల్లో నిందితురాలిగా ఉన్న సంగీతా సాహూను అరెస్టు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఓ ప్రత్యేక టీమ్‌ను ఒరిస్సాకు పంపించారు. దాంతో.. నంద్యాల అంజిరెడ్డి సారథ్యంలో ఒడిశా కాళీకోట్ వెళ్లిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ అక్కడి పోలీసుల సహకారంతో సంగీతాసాహును అరెస్టు చేసి తెలంగాణకు తీసుకొవచ్చారు.ధూల్‌పేట్‌లో 29 కేజీలు, 11.3 కేజీలతో పట్టుబడ్డ రెండు కేసుల్లోని నిందితులకు సంగీతాసాహు గంజాయి సరఫరా చేసినట్లు తేల్చారు. ధూల్‌పేట్‌లో శీలాబాయ్, నేహబాయ్, ఇష్కాసింగ్‌తోపాటు మరికొందరికి గంజాయి సప్లై చేసినట్లు పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారంతో ఆమెపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.అలాగే.. 2022లో హైదరాబాద్‌కు గంజాయి తీసుకొస్తూ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు పట్టుబడి.. జ్కెలుకు వెళ్లి వచ్చింది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడి వెళ్లి గంజాయి వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి లేడీ డాన్ సంగీతా సాహును ఒడిశాలో అరెస్ట్ చేసి తీసుకొొచ్చిన టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.ఇక.. సంగీతాసాహు ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ నటిలా వీడియోలు పోస్టు చేస్తుందని పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలోనే.. కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్న ఆమెను ఎట్టకేలకు హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె దందాపై ఆరా తీస్తున్నారు.. విచారణలో కీలక విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు పేర్కొంటున్నారు.

# గుడ్‌న్యూస్.. ఓలా, ఉబర్, ర్యాపిడో దోపిడికి చెక్.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి సహకార్ యాప్!




న్యూఢిల్లీ : ప్రధాన నగరాల్లో ఓలా, ఉబర్, ర్యాపిడోల వినియోగం బాగా పెరిగిపోయింది. విపరీతంగా పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా.. ఆయా కంపెనీలు వినియోగదారుల నుంచి భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. అలా అని క్యాబ్ డ్రైవర్లు అంతే మొత్తం చెల్లించడం లేదు. కస్టమర్ నుంచి తీసుకున్న ఛార్జీలో భారీగా కోత విధించి.. మిగతా డబ్బును డ్రైవర్లకు, రైడర్లకు చెల్లిస్తున్నాయి. వీటిపై డ్రైవర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సూపర్ ఐడియాతో ముందుకు వచ్చింది. సహకార్ ట్యాక్సీ పేరుతో ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వెల్లడించారు.డ్రైవర్లకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిన సహకార ఆధారిత రైడ్-హెయిలింగ్ సేవ 'సహకార్ ట్యాక్సీని ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఇందులో సహకార సంఘాలు ద్విచక్ర వాహనాలు, ట్యాక్సీలు, ఆటో రిక్షాలు నమోదు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. "ఇది కేవలం నినాదం కాదు. దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ మూడున్నర సంవత్సరాలుగా అవిశ్రాంతంగా కృషి చేసింది. కొన్ని నెలల్లో, డ్రైవర్లకు ప్రత్యక్ష లాభాలు అందించే విధంగా ఒక ప్రధాన సహకార ట్యాక్సీ సేవ ప్రారంభిస్తామని అని హోం మంత్రి అన్నారు.వినియోగదారుడు ఐఫోన్ లేదా ఆండ్రాయిడ్ ఫోన్‌ల బుక్ చేసుకుంటున్నారా అనే దాని ఆధారంగా కూడా రైడ్ ఛార్జీలు మారుతున్నాయని నివేదికలు వెలువడిన తర్వాత సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఇటీవల రెండు కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలకు ప్రతిస్పందనగా, ఓలా ప్లాట్‌ఫామ్ ఆధారిత ధర వివక్షత వాదనలను తోసిపుచ్చింది. "మా కస్టమర్లందరికీ మేము ఒక విధమైన ధరలు కలిగి ఉన్నాం, సెల్‌ఫోన్ ఆధారంగా ధర నిర్ణయించడం లేదని వెల్లడించింది. ఉబెర్ కూడా ఈ ఆరోపణలను ఖండించింది. అయితే.. ఇప్పుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకురానుండటంపై ఉబర్, ఓలా, ర్యాపిడో ఛార్జీలు తగ్గించే అవకాశం ఉంది.

# 'వామ్మో.. ఇదేం నీరు సారూ!' బండ్లగూడలో కలుషిత నీటి కలకలం..



బండ్లగూడ : రాష్ట్రంలో కలుషిత నీటి సరఫరా మరోమారు కలకలం సృష్టించింది. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో ఈ మేరకు కలుషిత నీరు సరఫరా అవుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్భాటంగా ప్రారంభించిన ఫిల్టర్ బెడ్ల నుంచి మురికి నీరు రావడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బండ్లగూడకు సరఫరా అయ్యేనీరు హిమాయత్ సాగర్ నుంచి వస్తుంది. ఈ నీటిని శుద్ధిచేసి పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం హిమాయత్ సాగర్ వద్ద ఇటీవల రూ.6 కోట్ల ఖర్చుతో ఐదు ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేసింది. దీంతో మంచినీటి కష్టాలు తీరాయని అందరూ అనుకుంటున్న తరుణంగా గత 20 రోజులుగా మళ్లీ మురుగు నీరు రావడం చర్చణీయాంశంగా మారింది.బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ నుంచి పంపిణీ చేస్తున్న మంచినీరు కలుషితంగా వస్తున్నట్లు బుధవారం ఉదయం హిమాయత్ సాగర్ గ్రామస్తులు జలమండలి అధికారి గోవింద్‌కి ఫిర్యాదు చేశారు. కలుషిత నీళ్లు తాగితే రోగాలు ప్రభలుతాయని, తమ ఆరోగ్యం గురించి పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిల్టర్లను మరోసారి తనిఖీ చేసి నీటిని శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. హిమాయత్ సాగర్ జలాశయం నుంచి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు గ్రామాలకు పంపిణీ చేస్తున్న మంచినీటిని పూర్తిస్థాయిలో ఫిల్టర్ చేయాలని, అధికారులు సత్వర చర్యలు తీసుకొని కలుషిత నీరు రాకుండా చూడాలని కోరారు.దీనిపై జలమండలి అధికారిక స్పందిస్తూ.. ఏదైనా పని జరుగుతుంటే మాత్రం మట్టి నీళ్లు వచ్చే అవకాశం ఉంటుందని జలమండలి అధికారి గోవింద్ గౌడ్ పేర్కొన్నాడు. కాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు గ్రామాలకు హిమాయత్ సాగర్ జలాశయం నుంచి నిత్యం లక్ష 20 వేల లీటర్ల నీటిని ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నారు.

# ఉసురు తీసిన బట్టతల.. పెళ్లి కావడం లేదని మనస్తాపంతో డాక్టర్ ఏం చేశాడంటే..



